క్లుప్తంగా

అప్పన్న స్వామికి ముత్యాల తలంబ్రాలు



దేవస్థానం ఈవో సుబ్బారావుకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న దాతలు

సింహాచలం : అప్పన్న స్వామి కల్యాణ మహోత్సవానికి ముత్యాల తలంబ్రాలను బహూకరించారు దాతలు. ఈనెల 8న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని గోపాలపట్నానికి చెందిన స్వర్ణ జ్యుయలర్స్ అధినేతలు బాబు, వెంకన్న, సునీల్, బాలాజీ కేజీ 500గ్రాముల ముత్యాల తలంబ్రాలను శనివారం అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన దాత, దేవస్థానం ఈవో కె.సుబ్బారావుకు ముత్యాలను అందించారు.

శ్రీరామచంద్రుడిగా వెంకన్న



రామావతారంలో వేంకటేశ్వర స్వామి

పెందుర్తి: శ్రీనివాసుడు శ్రీరామచంద్రుడిగా దర్శనమిచ్చారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక వెంకటాద్రిలో కొలువైన వేంకటేశ్వర స్వామి శనివారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం, అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం తదుపరి సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించారు. భక్తులకు వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు వైద్య సిబ్బంది

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చింతలగ్రహారం కాలనీలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇటీవల మృతి చెందిన శిష్టకరణాల సంఘం సలహాదారు, వ్యాపారవేత్త డబ్బీరు వెంకటరావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు దాదాపు 300 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సల కోసం సిఫార్సు చేశారు. కాలనీ పెద్దలు, నిర్వాహకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు ఆహ్వానం

సింహాచలం: ఈ నెల 8న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం, 30న జరిగే చందనోత్సవంలో పాల్గొనాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ఆహ్వానించారు. నర్సీపట్నంలోని స్వగ్రామంలో అయ్యన్నను శనివారం కలిసిన ఈవో ఆహ్వాన పత్రిక, ప్రసాదం, శేషవస్త్రం, స్వామివారి చిత్రపటాలను అందించారు. ఈవో వెంట దేవస్థానం అర్చకుడు రాజీవ్‌లోచన్, వేదపండితులు ఉన్నారు.

12న హనుమాన్ శోభాయాత్ర

మహారాణిపేట: ఈనెల 12న నగరంలో హనుమాన్ శోభా యాత్ర పేరిట భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ కోసం హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగర పరిధిలో ఐదు ప్రాంతాల నుంచి ప్రణాళిక తయారు చేశారు. పెందుర్తి, గాజువాక, మారియట్ హోటల్, ఆనందపురం, పోస్టాఫీసు తదితర ప్రాంతాల గుండా సాగే ర్యాలీ సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌కు చేరుతుంది. అక్కడి నుంచి హనుమాన్ శోభా యాత్ర మొదలై కాళీమాత దేవాలయం వరకు సాగుతుంది.

1,514వ రోజుకు ఉక్కు పోరాట దీక్షలు



దీక్షలో ఏఐటీయూసీ కార్యకర్తలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1514వరోజుకు చేరాయి. దీక్షల్లో ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని.. ఉద్యోగులకు నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ ఆలీసా, మంత్రి రవికిరణ్, సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల ఇరువాడ గ్రామంలోని కాళ్ల జగ్గారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. 8 తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.1.20 లక్ష నగదును దొంగలు అపహరించారు. బాధిత కుటుంబ సభ్యులు సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఇరువాడ కోళ్ల ఫారాల సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా.. చోరీ జరిగిన సమయంలో ఒక ఆటో ఇరువాడ నుంచి సబ్బవరం రావడం గుర్తించారు. వివరాలు సేకరించి విశాఖకు చెందిన ఆటోగా తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్‌ను విచారించగా.. బాధితుడి కుటుంబానికి చెందిన బంధువైన ఒక మహిళా ఆటోలో వచ్చి ఇంట్లో దొంగతనానికి పాల్పడిందని పోలీస్ విచారణలో తెలుసుకున్నారు. తిరిగి వెళ్లే సమయంలో ఆటో డ్రైవర్‌కు చార్జీలను ఫోన్‌పే చేయడంతో వీటికి సంబంధించిన విజువల్స్ సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో పోలీస్‌లు కూపీలాగి కేసును చాకచక్యంగా ఛేదించారు. నిందితురాలిని పట్టుకుని దొంగిలించిన సొత్తును బాధిత కుటుంబానికి అప్పగించారు.



గొర్లివానిపాలెం జంక్షన్‌లో సీసీ కెమెరాలు

గతేడాది నవంబర్‌లో మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో చిన్నయ్యపాలెం వద్ద అనకాపల్లి నుంచి పెందుర్తి వైపు వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో టూ వీలర్‌పై వెళ్తున్న మానేపల్లి సింహాద్రి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హైవేపై ఆనందపురం టోల్‌గేట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఒక టిప్పర్ లారీతో ఢీకొట్టి పరారైనట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ పరమజిత్ సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో నడుస్తోంది. ఇలా అనేక సంఘటనల్లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

సబ్బవరంపై నిఘా నేత్రం





సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, (ఇన్‌సెట్‌లో) సీసీ కెమెరాలు



ఒక షాప్‌లో అమర్చిన సీసీ కెమెరా



- మండలంలో 200 వరకు సీసీ కెమెరాల ఏర్పాటు
- నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో కీలకం
- మరిన్ని ఏర్పాటుకు దాతలు సహకరించాలని పోలీసుల విజ్ఞప్తి
- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

చోడవరం రోడ్డులో నిఘా నేత్రాల పహారా

సబ్బవరం: నేరాల నియంత్రణకు, నేరస్తులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ప్రస్తుత కాలంలో ఒక సాధనంగా మారాయి. అవి లేకపోతే రక్షణ లేదు అనే పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, వాణిజ్య సముదాయాలు, దేవాలయాలు వంటి ప్రదేశాల్లో సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. ప్రధాన జంక్షన్లలో సుమారు 20 చోట్ల వరకు సీసీ కెమెరాలు పహారా కాస్తున్నాయి.

మండలమంతా ఏర్పాటు చేసేలా..

సబ్బవరం మండలంలో నేర నియంత్రణకు సుమారు 200 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలోపాటు మండలమంతా కవర్ చేయడానికి మరో 300 వరకు సీసీ కెమెరాలు అవసరమని పోలీస్ అధికారులు చెబుతున్నారు. సీసీ కెమెరాల ప్రయోజనాలపై మండల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని పోలీసులు కోరుతున్నారు. దీని కోసం మహిళా పోలీస్‌లకు సమావేశాలు నిర్వహించి, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

నిత్యం పర్యవేక్షణ..

మండలంలో సుమారు 24 గ్రామ పంచాయతీలున్నాయి. అన్ని గ్రామాల్లో నేర నియంత్రణ, పర్యవేక్షణలో భాగంగా గ్రామ ముఖద్వారం, శివార్లు, ప్రధాన కూడళ్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మిగిలిన ప్రజా ప్రతినిదులు నేర నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని పలు విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, జాతీయ రహదారి కూడళ్లు ఉండటంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. అధికా రులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

అన్ని చోట్ల సీసీ కెమెరాలు



నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. అధిక శాతం ఛేదిస్తున్న కేసులన్నీ సీసీ కెమెరాల సహాయంతోనే. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రధాన జంక్షన్లు, వాణిజ్య సముదాయాలు, దేవాలయాలు వంటి ప్రదేశాల్లో విధిగా సీసీ కెమెరాలను ఇప్పటికే ఏర్పాటు చేశాం. మరిన్ని ప్రదేశాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– పిన్నింటి రమణ, సీఐ, సబ్బవరం సర్కిల్

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పరవాడ: సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 7 నుంచి 17వ తేదీలోగా తమ దరఖాస్తులను ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారికి సమర్పించాలని సూచించారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం కాల్‌లెటర్లు జారీ చేస్తామని పీవో తెలిపారు. కాల్‌లెటర్‌లో పొందుపరిచిన తరువాత మౌలిక పరీక్ష నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలియజేశారు.

ఖాళీలివి.. : పరవాడ మండలంలో వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ), ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం అంగన్‌వాడీ ఆయా(ఓసీ), లంకెలపాలెం-1 అంగన్‌వాడీ ఆయా(ఎస్టీ), పొన్నూరు అగ్రహారం అంగన్‌వాడీ ఆయా(ఎస్టీ), దేశపాత్రునిపాలెం-1, దేశపాత్రునిపాలెం-2 అంగన్‌వాడీ ఆయాలు (ఎస్సీ), ముత్యాలమ్మపాలెం-2 అంగన్‌వాడీ ఆయా(ఓసీ), తాడి కొత్తకాలనీ మినీ అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ), సబ్బవరం మండలంలో అయ్యన్నపాలెం అంగన్‌వాడీ ఆయా (బీసీ-బీ), అనకపల్లి-1 అంగన్‌వాడీ ఆయా (బీసీ-సీ), పెద యాతపాలెం అంగన్‌వాడీ ఆయా (ఓసీ)లకు చెందిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లలితకుమారి ప్రకటనలో పేర్కొన్నారు.

గొల్లలపాలెం అపార్ట్‌మెంట్స్‌లో చోరీ

20 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం శివలోహిత గ్రీన్‌వ్యాలీ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న గండి వెంకట అప్పారావు ఫ్లాట్‌లో జరిగిన చోరీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంట్లో 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు నగదు చోరీ జరిగినట్లు బాధితుడు వెంకట అప్పారావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పిన్నింటి రమణ శనివారం తెలిపారు. వెంకట అప్పారావు స్వగ్రామం మల్కాపురం కాగా.. దొంగతనం జరిగిన రెండు రోజుల ముందు ఇంటికి తాళాలు వేసి స్వగ్రామానికి వెళ్లాడు. ఫ్లాట్ వెనుక నుంచి గ్రిల్స్ లేకపోవడంతో పీవీసీ డోర్ల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బంగారం, నగదు దొంగిలించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఫ్లాట్‌లో వెంకట అప్పారావుతోపాటు భార్య వెంకటలక్ష్మి, కుమార్తె రేవతి, పెద్ద కుమారుడు తరుణ్, చిన్న కుమారుడు జ్ఞానేశ్వరరావు ఉంటున్నారు. ఈ నెల 2న చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు. ఇటీవల సింగిల్‌గా ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్నట్లు చెప్పారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

- ఆయన సేవలు చిరస్మరణీయం
- కొనియాడిన వక్తలు
- జయంతి వేళ ఘన నివాళులు



మొగలిపురంలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐడీ బాబు తదితరులు



అంతకాపల్లిలో బాబూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మహాలక్ష్మీనాయుడు తదితరులు



రాంపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



చినముషిడివాడలో నివాళి అర్పిస్తున్న శానాపతి వసంత



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గనిశెట్టి

పరవాడ: దళిత బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో మొట్ట మొదటి ఉప ప్రధానిగా, 50 ఏళ్లు ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవ చేశారన్నారు. పదవీ కాలమంతా దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారన్నారు. మతోన్మాదానికి, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జె.సూరిబాబు, నూకరాజు, ఎం.శ్రీను, పార్వతి, రామలక్ష్మి, దీపు, దుర్గా, అనిత, దేముడమ్మ పాల్గొన్నారు.

మహనీయుడు జగ్జీవన్ రామ్

సబ్బవరం: ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం తన జీవితాన్నే ధారపోసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని ఉత్తరాంధ్ర దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు ఐడీ బాబు పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మొగలిపురంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. భారత ఉప ప్రధానిగా, కార్మిక, వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా నాలుగు దశాబ్దాల పార్లమెంటేరియన్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, గ్రామ పెద్దలు గొటివాడ అప్పారావు, అయినింటి రాజు, పుచ్చ సోంబాబు, గొటివాడ సత్యనారాయణ, గోపి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

➡ అంతకాపల్లిలో నీటిపల్లి గంగరాజు అధ్యక్షతన జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి గ్రామ పెద్ద మిడతాడ మహాలక్ష్మినాయుడు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్, రొంగలి దేముడు బాబు, ఇందుగుబిల్లి గోపి, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

పెందుర్తి: దేశ మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా అదీప్‌రాజ్ కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పిలి కనకరాజు, బోకం రామునాయుడు, గొరపల్లి శ్రీను, చిరికి దేముడు, రాపర్తి మాధవరావు, అప్పలనాయుడు, సత్తిబాబు, గోపి, కోరుబిల్లి సతీష్, బాదిరెడ్డి కృష్ణ, ముమ్వల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చినముషిడివాడలో..

కూడలి వద్ద ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు పూలమాల వేసి నివాళి అర్పించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న ఇద్దరిపై కేసు

- పట్టుబడిన పొక్లెయిన్, లారీ స్టేషన్‌కు తరలింపు

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారం కొండవాలు ప్రాంతం లేఅవుట్‌ల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న పొక్లెయిన్, లారీని పట్టుకున్నట్లు సీఐ పిన్నింటి రమణ శనివారం తెలిపారు. పట్టుబడిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, పొక్లెయిన్ ఆపరేటర్ ఎస్.బాలాజీ, లారీ డ్రైవర్ ఎం.చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలోని జీవీఎంసీ పరిధిలో గల గంగవరం, వెదుళ్లనరవతోపాటు ఎరుకునాయుడుపాలెం, పైడివాడ, పైడివాడ అగ్రహారం, వంగలి, రాయపుర అగ్రహారం గ్రామాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతుండటంతో ఆయా ప్రాంతాలపై నిఘా ఉంచామని ఈ సందర్భంగా సీఐ తెలియజేశారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై అవగాహన

విద్యార్థులకు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రామకృష్ణ ప్రత్యేక శిక్షణ



అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

పరవాడ: పేద విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్స్ తదితర అంశాల్లో పరిజ్ఞానం పెంపొందించుకోవాలని వాడచీపురుపల్లి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కుమిలి రామకృష్ణ సూచించారు. రామకృష్ణ విధులు ముగించుకున్న అనంతరం స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఏఐ, రోబోటిక్స్ తదితర అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై అవగాహనతో పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శిక్షణ ఇస్తున్న రామకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, ఇందిర, సంజీవరావు, సౌజన్య, అరుణజ్యోతి పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ పోర్ట్ యూనియన్ ప్రతినిధులు

పెందుర్తి: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ప్రతిపాదన తక్షణమే ఆపాలని సీఐటీయూ పోర్టు యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.ఎస్.పద్మరాజు డిమాండ్ చేశారు. పోర్టు సొంత నిధులతోనే ఆస్పత్రిని అభివృద్ధి చేసి ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు నిరసనగా సీఐటీయూ పోర్టు యూనియన్ ఆధ్వర్యంలో శనివారం చినముషిడివాడలోని పోర్టు ఆస్పత్రి డిస్పెన్సరీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పద్మరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను అన్ని విధాల మభ్యపెట్టి గెలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఇప్పుడు అన్ని రంగాల్లో ప్రైవేటీకరణ జపం చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. పోర్టు, డాక్ ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, పూల్ కలాసీలు, క్యాజువల్ కార్మికులకు నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆస్పత్రిని అర్ధాంతరంగా ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఈ ప్రక్రియను నిలపాలని.. లేనిపక్షంలో భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, అధ్యక్షుడు జె.సత్యనారాయణ, సభ్యులు మంగయ్యనాయుడు, జగన్నాథస్వామి, ప్రభుదేవా, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.2 లక్షల విరాళాలు



దాత అప్పలరత్నంకి బాండ్ అందజేస్తున్న ఏఈవో శ్రీనివాసరావు




దాత అప్పారావుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వావి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక దరి శ్రీనగర్ ప్రాంతానికి చెందిన ఎం.అప్పలరత్నం అనే దాత లక్ష రూపాయల విరాళాన్ని, హైదరాబాద్‌కి చెందిన ఎస్.అప్పారావు అనే దాత లక్ష 116 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు ఏఈవో పిల్లా శ్రీనివాసరావు, ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్లు అందించారు.

కాంట్రాక్ట్ కార్మికుల రాస్తారోకో

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగించడాన్ని నిరసిస్తూ కూర్మన్నపాలెంలో శనివారం సాయంత్రం కార్మిక సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే పోలీసులు భారీగా మోహరించారు. ఆందోళన కారులను నిలువరించారు. కార్మిక సంఘాల నాయకులు మంత్రిరాజశేఖర్, ఆదినారాయణ గంగారామ్ తదితరులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంకుశ వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. మెడికల్ టెస్ట్‌లు, ఇతర పేర్లు చెప్పి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం మానుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వివాహిత మృతి



ఝాన్సీ (ఫైల్)

సబ్బవరం: మండలంలోని సబ్బవరం కొత్త రోడ్డు సమీపాన గొర్లివానిపాలెం రోడ్డులో ద్విచక్ర వాహనం నుంచి జారిపడిన ఘటనలో కె.కోటపాడుకు చెందిన ఓ వివాహిత మృతి చెందింది. స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా.. కె.కోటపాడుకు చెందిన కళ్యాణం ఝాన్సీ(23) తన భర్త మరిడయ్య, ఇద్దరు పిల్లలు డేవిడ్(6), జీవన్‌కుమార్(4)తో కలిసి సబ్బవరంలోని బుడగజంగాల కాలనీలోని తన అమ్మగారి ఇంటికి నాలుగు రోజుల కిందట ద్విచక్ర వాహనంపై వచ్చింది. తిరిగి స్వగ్రామం కోటపాడుకు వెళ్తుండగా.. గొర్లివానిపాలెం రోడ్డులోని నూకాలమ్మ ఆలయ సమీపంలో ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడటంతో ఝాన్సీకి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు రోజుల కిందట జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం మృతి చెందింది. ఝాన్సీ తండ్రి రాజుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణ తెలిపారు.

అన్నిరంగాల్లో రాణించాలి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఉత్సాహంగా జరిగాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథి భీమునిపట్నం రెవెన్యూ డివిజన్ అడ్మిన్స్ట్రేటివ్ అధికారి ఆలిస్ మనోరంజని మాట్లాడారు. అమ్మాయిల్లో విజ్ఞానం సమాజాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కళాశాలను వీడిన తర్వాత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. వివిధ గ్రూపుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, డాక్టరేట్ సాధించిన లెక్చరర్లను సత్కరించారు.

హెచ్‌ఎస్‌ఎల్‌లో నేషనల్ మారిటైమ్ డే వేడుకలు



షిప్‌యార్డ్‌ను సందర్శించిన హైదరాబాద్ సీసీఐ యంగ్ ఇండియన్ సభ్యులు

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థలో నేషనల్ మారిటైమ్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశంలో మొట్టమొదటి ఆధునిక షిప్‌యార్డ్, మొదటి విమాన కర్మాగారం, మొదటి కార్ ఫ్యాక్టరీని స్థాపించిన సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్ దోషిని గుర్తు చేసుకుంటూ ఘనంగా నివాళుల ర్పించారు. నేషనల్ మారిటైమ్ డేను పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన సీఐఐ-యంగ్ ఇండియన్స్ సభ్యులతో కూడిన 25 మంది షిప్‌యార్డ్‌ను సందర్శించగా, వారికి సంస్థకు చెందిన అధికారులు పలు అంశాలను వివరించారు. 1919వ సంవత్సరం ఏప్రిల్ 5న సింధియా స్టీమ్ నావిగేషన్ మొదటి భారతీయ ఓడ ఎస్ఎస్ లాయల్టీ ముంబై నుంచి లండన్ వరకు ప్రయాణించిందని, నాటి స్ఫూర్తితో ఆత్మ నిర్భర్ భారత్‌కు అనుగుణంగా ఆధునిక నౌకలను నిర్మించడం ద్వారా సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్ దోషి కలలకు కట్టుబడి ఉన్నట్లు అధికారులు తెలిపారు.